

# కించిత్ భోగో భవిష్యతి

# కించిత్ భోగే భవిష్యతి

త్రిభువన సంచారి అయిన నారదుడు విశాఖపట్నపు సముద్ర తీరంలో ఒక నాడు తిరుగుతూ ఉండగా కాలికి ఏదో తగిలింది. ఏమిటా అని చూస్తే అది ఒక పుర్రె! ఒంగి, దానిని చేతిలోకి తీసుకుని, ఆ కపాలపు లలాట క్షేత్రాన్ని కుతూహలంతో పరీక్షించి చూసేడు. అక్షరాలు మసకగా కనిపించేయి.

`... ... ... ... .

... ... నే సంచారం

సముద్ర తీరే మరణం

కించిత్ భోగే భవిష్యతి`

''సందేహం లేదు. ఇది విరించి వ్రాతే! వికటించిన విరించి వ్రాత! ఈ చతుర్ముఖుడు తన భుజస్కంధాల పైనున్న సృష్టి కార్యపు భారాన్ని మోయ లేక పోతున్నాడా?వార్ధక్యంతో సామర్ధ్యం తగ్గిపోతోందా? లేకపోతే ఏమిటీ పిచ్చి రాతలు? ఒక అభాగ్యుడిని కీర్తి కాంక్షతో జీవితమంతా వేధించి, పాపభూమి అయిన విశాఖపట్నపు సముద్ర తీరంలో జీవితం అంతమొందించి, మరణానంతరం కించిత్ భోగం ప్రసాదిస్తాడా?''

బ్రహ్మ మానస పుత్రుడయిన నారద మహాముని నిశిత మయిన కుశాగ్ర బుద్ధికి ఈ కుతర్కం అర్ధం కాలేదు. `కించిత్ భోగే భవిష్యతి` ట. చచ్చిన తర్వాత భోగం ఏమిటి? బుర్ర లేక పోతే సరి! ముఖాముఖీ తేల్చుకోవలసిన విషయం ఇది. వైజాగు బీచి నుండి సత్యలోకానికి హుటాహుటీగా ప్రయాణం కట్టేడు, నారదుడు.

భక్తితోయాత్ర పూర్తి చేసుకుని కార్య సిద్ధికి ఎదురు చూస్తున్నాడు లక్ష్మణరావు. తల నీలాలు స్వామికి చెల్లించేసేడేమో తలకి పాగా చుట్టేడు.

''సి. వీ. రామన్‌లా ఉన్నావోయ్ అన్నారు సహోద్యోగులు. మురిసిపోయేడు లక్ష్మణరావు. పోలిక కుదిరింది కనుక అదృష్టం కూడ పడితే నోబెల్ బహుమానం కాక పోయినా కనీసం భట్నగర్ ఎవార్డు అయినా రాకపోతుందా అనుకున్నాడు.

ప్రముఖులతో పోల్చి చూసుకోవడం రావు గారి హాబీలలో ఒకటి. సంస్కారం లేకుండా, ఉడతలు పీకిన తాట్టెంకలా ఉన్న జుత్తుని చూసి ఎవరో అయిన్‌స్టయిన్ క్రాఫింగులా ఉందన్నారుట. అంతే! నాటి నుండి కేశ సంస్కారానికి స్వస్తి వాచకం పలికేడు లక్ష్మణరావు.

తెరచాప ఎత్తి పడవని నడపడం అంటే అయిన్‌స్టయిన్‌కి వల్లమాలిన సరదా. అత్తారింటికి అమలాపురం వెళ్లినప్పుడల్లా – గోదావరి కాలవలో కాదు – గోదావరిలోనే పడవ నడపడం ప్రేక్టీసు చేసేవాడు. ఒకసారి సుడిగుండంలో పడగా చావు తప్పి కన్ను లొట్ట పోయినంత పని అయింది.

నడపడం ప్రేక్టీసు చేసేవాడు. ఒకసారి సుడిగుండంలో పడగా చావు తప్పి కన్ను లొట్ట పోయినంత పని అయింది.

పోనీ ఫిడేలు వాయిద్యంలో ప్రావీణ్యత సంపాదిద్దామని ప్రయత్నం చేసేడు. అయిన్‌స్టయిన్‌కి మల్లే 'బాక్' వాయించ లేకపోయినా అపస్వరాలతో సరళిస్వరాలు వాయించేవాడు. తను సాధకం చేస్తూన్నప్పుడల్లా తన భార్యామణి వీధి గుమ్మంలో కూర్చునేది. సైంటిస్టు కదా. ప్రతీ విషయానికి కారణం తెలుసుకునే వరకు తోచేది కాదు. అందుకని, ఉండబట్టక అడిగేసేడు.

''నేను ఫిడేలు వాయించినప్పుడల్లా వీధి గుమ్మంలోకి వెళ్లి కూర్చుంటావు ఎదుకూ?''

''ఆ! మరేం లేదు. పెళ్లాం కొట్టడం లేదని ఊరు వాళ్లకి హామీ ఇస్తున్నానండీ.'' పురిటిలోనే సంధి కొట్టినట్లు ఫిడేలు వాయిద్యం ఇలా బెడిసి కొట్టింది.

ఏకలవ్యుడిలా గురువు గారి ఫొటోని ఎదురుగా పెట్టుకుని 'పైపు' తాగడం ప్రేక్టీసు చెయ్యడం మొదలు పెట్టేడు. సిరి అబ్బక పోయినా చిడుం అబ్బిందంటారే అలాగ లక్ష్మణరావుకి పైపు తాగడం అలవాటు మిగిలింది.

ఈ కీర్తి కండూతి లక్ష్మణరావుకి పుట్టుకతో పుట్టిన బుద్ధే. పరశురామా లయన్ సర్కస్ వారు బంతుల బీడులో డేరాలు ఎప్పుడు ఎత్తేస్తారా అని చూసే వారుట లక్ష్మణరావు తల్లిదండ్రులు. ఊళ్లో ఉన్న ఊరకుక్కలు, పందులు, గాడిదలు, అన్నీ వాకిట్లోనే సర్కస్ చేస్తూ ఉంటే ఎన్నాళ్లని భరిస్తారు, కొడుకు మీద ఎంత అభిమానం ఉన్నా! ఏ నాగేశ్వర్రావు లాగో, ఎన్టీయార్ లాగో అయిపోదామని ఎంతగానో కలలు కన్నాడు. చదువు మానేసి ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే మక్కెలు విరగ్గొట్టి, పులుసులోకి ముక్కలు లేకుండా చేస్తానని తండ్రి బెదిరించేసరికి చదువు మీదకి దృష్టి మరలింది.

'యమాతారాజభానస' అని పెత్తెలుగు మేష్టారు బోర్డు మీద రాసేసరికి మన లక్ష్మణరావు జన్యుపదార్థం లోనుండి కవిత్వం ఆశువుగా పెల్లుబికి వచ్చిందనడానికి ఆస్కారం లేదు కానీ మానవుడి సృజనాత్మక దృక్పథంలో కొంత మార్పు వచ్చింది. చదువు సంధ్యల మీదికి దృష్టి మరలింది. పద్యాల మీద పరిశోధనలు, ప్రయోగాలు చేసే వాడు. సర్కస్‌లో ఏనుగు మీద పెద్దపులి సవారీ చేసిన ఘట్టాన్ని వర్ణించడానికి మత్తేభ, శార్దూల విక్రీడితాల ఛందస్సుని మేళవించి 'మత్తశార్దూలం' అనే కొత్త రకం వృత్తానికి వరవడి చుట్టేడు. సనాతనుడయిన తెలుగు మేష్టారు, ''ప్రయోగం పేరిట శుద్ధ ఛందస్సుని మంట గలుపుతావుట్రా? ఒరేయ్, రావూ, నీకు పద్యాలు రావురా!'' అని ప్రాస కోసం పాకులాడుతూ తల వాచేలా చివాట్లు పెట్టేరు. భారతి, త్రివేణి వంటి పత్రికలు కూడ ఏమీ ప్రోత్సహించ లేదు. 'ద అన్ పబ్లిష్డ్ వర్క్స్ అఫ్ ద లేట్ గ్రేట్ లక్ష్మణ్రావ్' అని ఎప్పుడేనా, ఎవ్వరయినా ప్రచురించక పోతారా అని సిరాతో ఖరాబు చేసిన కాగితాలన్నిటిని జాగ్రత్తగా కట్ట కట్టి, భావి తరాల వారి కొరకు అటక మీద భద్ర పరచేడు.

లక్ష్మణరావు దృష్టి బాహ్య ప్రపంచం నుండి కొద్దిగా లోనికి మళ్లింది. బాడవ తోటలో కొబ్బరి చెట్టు కింద పద్మాసనం వేసుకొని కూర్చుని ``బుద్ధం శరణం గచ్ఛామి'' అన్నాడు. కొబ్బరి కాయ ఎక్కడ నెత్తి మీద పడుతుందో అనే బెంగో, ఋషి పక్షులు రెట్ట వేస్తాయేమోనన్న భయమో మరి, మనస్సుని నిలకడగా ఉంచలేక పోయాడు. మనస్సులో ఆలోచనలు పరిపరి విధాల పరిగెడుతున్నాయి.

పసందయిన పొడి అక్షరాల పేరు లేకపోబట్టే తన రాతలన్నీ బుట్టపాలు అవుతున్నాయి. శ్రీశ్రీ, సినారె, కరుణశ్రీ, మొదలయిన వారంతా ఖ్యాతి గణించడానికి కారణం వాళ్ల కవిత్వం లోని పటుత్వమేనా కారణం? శ్రీశ్రీకి వాళ్ల నాన్న మరీ `పెంటబ్బాయి' అని కాకపోయినా, `శ్రీరంగం అప్పారావు' అని పేరు పెట్టుంటే మనకి శ్రీశ్రీ ఉండే వాడే కాదేమో. పిల్లల భావికి తల్లిదండ్రులు మంచి పేరుతో పునాదులు వెయ్యాలి. ఆ మాత్రం ముందు చూపు లేని తల్లిదండ్రుల మీద కించిత్తు కోపం వచ్చింది లక్ష్మణరావుకి.

కనీసం `రామారావు' అనేనా పెట్టేరు కాదు. లక్ష్మణుడు ఎప్పుడూ రెండవ వాడే. ఇలా ద్వితీయ స్థానంలో పడి `రాట'వమని తన తల్లిదండ్రులు ఇలా పేరు పెట్టి శపించేరా? పేరంటే నప్పలేదని తల్లిదండ్రుల మీద విరుచుకు పడొచ్చు. ఇంటి పేరు సంగతి? మందపాటి! ఇంకా నయం. మందకోడి అనలేదు!! ఇటువంటి దీనావస్థలో ఉన్న తన పేరుని సుందరీకరించడం ఎలా? కరుణశ్రీ నుండి వెధవశ్రీ వరకు ఉన్న పేర్లన్నీ గాలించి చూశాడు. మందపాటిని `మందశ్రీ' అని అంటే? ఛా! ఛా!! చాల `డల్'గా ఉంది. పోనీ, పేరులోని పొడక్షరాలకి శ్రీ చేర్చితే? `మలశ్రీ' అయింది. హత విధీ! పోనీ, మందపాటి లక్ష్మణ రావులో పొడక్షరాలు తీసుకొని `మలరా' అంటేనో? కలరా లా మలరా ఏమిటి? ఒళ్లు మండింది.

ఇలా ఆత్మ ప్రక్షాళనం చేసుకుంటూన్న లక్ష్మణరావుని బాహ్య ప్రపంచంలోనికి ఈడుచుకొచ్చింది పక్కనే నేల మీద పడ్డ నారికేళం. చుక్కలో తప్పి పోయింది కాని కపాల మోక్షం జరిగి పోయి ఉండేది. శరీరం గగుర్పొడిచింది. భర్తృహరి సుభాషితం తళుక్కున మనస్సులో మెరిసింది. దైవోపహతుడు సేద తీర్చుకునేందుకు తాటిచెట్టు నీడని చేరితే నెత్తి మీద తాటిపండు పడిందిట. ప్రస్తుతం నారాకేళం నెత్తి మీద పడ లేదు కనుక తను దైవోపహతుడు కాదు. లక్ష్మణరావుకి మనో వికాశం కలిగింది. కొబ్బరి చెట్టు కిందనుండి లేచేడు. బుద్ధిమంతుడై, నిర్మాణాత్మకంగా ఆలోచించడం మొదలు పెట్టేడు.

వెధవ కాయ! కిందకి ఎందుకు పడాలి? ఇది భగవదేచ్ఛ అనేసి ఎలా ఊరుకోవడం? కాయ ఆకాశంలోకి ఎందుకు ఎగిరి పోలేదు? బాడవ తోటలోని భూమి కొబ్బరికాయని కాని ఆకర్షిస్తోందా? అదే నిజమయిన పక్షంలో సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్రాదులు కట్ట కట్టుకుని వచ్చి భూమి మీద ఎందుకు పడి పోవడం లేదు? గెలెలియో, కెప్లర్, న్యూటన్ మొదలయిన మహనీయులందరూ కలసి సాయం పట్టి, సాన పట్టిన ఈ సిద్ధాంతం సొంతం తన పుర్రె లోనే పుట్టిందని నెత్తి నోరూ మొత్తుకున్నా ఎవ్వరూ వినిపించుకో లేదు. సరికదా, ఇంకా వాగితే పిచ్చాసుపత్రిలో పడేస్తామని బెదిరించేరు.

తను ఇలా నలుగురిలోనూ నవ్వులపాలవడానికి కారణం ఇంటరులో చేరి భౌతిక శాస్త్రం చదివే వరకు అర్థం కాలేదు. తెలుగులో కవిత్వం చెప్పడం అబ్బలేదు కాని, భౌతిక రసాయన శాస్త్రాలు బాగానే అబ్బేయి. ఆర్కిమిడీస్, ఎవగాడ్రో, గే లుసాక్, బెర్జీలియస్, ... ఇలా ఎంతో మంది హేమాహేమీల గురించి తెలుసుకున్నాడు. ఇంటరు మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకి చేరేడు. సద్ధర్మ సదనంలో మకాం.

విశాఖపట్నపు వాతావరణంలో లక్ష్మణరావు వైజ్ఞానిక విజ్ఞానం మొగ్గ తొడిగి, వికసించి పరిమళించింది. ఊహా శక్తి విస్తరించింది. 'రేంకు' రాక పోయినా ప్రపంచ జ్ఞానం బాగా పెంచుకున్నాడు. కాలం, కర్మం కలసి వస్తే కక్కు వచ్చినట్లు ఒద్దనుకున్నా కీర్తి వస్తుందనే నీతి పాఠం నేర్చుకున్నాడు. ఉదాహరణకి, గ్రహాల గతి పథాల మీద కెప్లర్ వేసిన లెక్కలలో కనీసం అర డజను తప్పులేనా కనిపించేయి, లక్ష్మణరావు నిశితమైన నేత్రాలకి. కెప్లర్ అదృష్టం తన్నుకొచ్చింది కనుక ఆ తప్పులు ఒకదానిని మరొకటి రద్దు చేసేసుకున్నాయి. కెప్లర్ గొప్పవాడని ప్రపంచం అంతా ఒప్పేసుకుంది.

'అయిన్‌స్టీమియమ్', 'ఫెర్మియమ్'లలా, తన పేరు ఒక మూలకానికి పెడితే? నూట అయిదవ మూలకాన్ని కాని తను కనిబెడితే దానికి 'మలేరియం' అని పేరు పెట్టవచ్చు. సైక్లోట్రానులు, ఏక్సిలిరేటర్లు లేకుండా ఈ పని చెయ్యడం తన తరమా? పోనీ, ఒక తోకచుక్కని కనిబెడితే? తోకచుక్క చీదేసిన సిసింద్రీలా తుస్సుమన్నా కహూటెక్ పేరు ప్రపంచం అంతా మోగిపోయిందే!

పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలచి పోవాలంటే మరొక మార్గం ఉంది. ఒక సిద్ధాంతాన్ని లేవదియ్యాలి. ఆ సిద్ధాంతం ఎలా ఉండాలంటే అది తప్పో, ఒప్పో ఎటూ తేల్చడానికి వీలు కాకుండా ఉండాలి. ఉదాహరణకి. దేవుడు లేడని వాదించే నాస్తికులు ఏమంటారు? "ఏదీ, దేవుడు ఉన్నాడని రుజువు చెయ్యి" అంటారు. దేవుడు లేడని వాళ్లు మాత్రం రుజువు చెయ్య గలరా? అలాగన్న మాట. లక్ష్మణరావు ఈ ఊహనాన్ని మథించి మథించి చూసేడు. కాని ఇలాంటి ఊహనాలు, సిద్ధాంతాలు సామాన్యులు ప్రతిపాదిస్తే బలం పుంజుకోవు. లక్ష్మణరావు ప్రతిపాదించి చూసేడు. అవి వెను వెంటనే వీగి పోయాయి. అదే ఏ అయిన్‌స్టయినో ప్రతిపాదించి ఉంటే అది తప్పయినా సరే వేదం అయి ఊరుకుంటుంది – కాస్మలాజికల్ స్థిరాంకంలా. శ్రీకృష్ణుడు చేస్తే రాసక్రీడ. మా ఊళ్లో రంగశాయి చేస్తే ....?

చదువు పూర్తవగానే లక్ష్మణరావు ఎదురు చూస్తూవున్న స్వతంత్రం వచ్చింది. హోంవర్కులు, పరీక్షలు, మొదలయిన బాదరబందీల నుండి బయట పడ్డాడు. ఆర్థికంగా ఒకరి మీద ఆధార పడవలసిన రోజులు పోయాయి. పంజరం నుండి బయట పడ్డ పిట్టలా ఉంది ఆయన జీవితం. ఇటుపైన తనకి ఇష్టం వచ్చిన ప్రయోగాలు చేసుకోవచ్చు.

ఆంధ్రా యూనివర్శిటీలో చిన్న లెక్చరర్‌గా చేరి, అంత కంటె చిన్న ప్రయోగశాలని నెలకొల్పేడు. 'వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం' అన్నట్లు, లక్ష్మణరావు చవి చూడని సబ్జక్టు అంటూ లేదు. 'కావేవీ కవితకనర్హం' అని శ్రీశ్రీ అన్నట్లు ఎన్నెన్నో విషయాలమీద పరిశోధనలు చేసేడు.

భారతదేశాన్ని జంబూద్వీపం అని మనవాళ్లు ఎందుకు అన్నారు? ఆర్యులు ఆర్యావర్తానికి వచ్చిన కొత్తలో ఆవు మాంసం తినేవారుట. నిజమేనా? ఆసేతుహిమాచల పర్యంతం మన దేశాన్ని కళ్లకి కట్టినట్లు వాల్మీకి రామాయణంలో ఎలా వర్ణించగలిగేడు? ఆ రోజులలో రహదారులు, ప్రయాణ సౌకర్యాలు లేవు కదా? అర్జునుడు గంగానదిలో మునిగి పాతాళలోకం వెళ్లేడంటారు. ఇక్కడ 'పాతాళలోకం' అంటే 'అమెరికా ఖండం' అని ఒక సిద్ధాంతం లేవదీశాడు. పునర్జన్మ సిద్ధాంతం నిజమయితే ప్రపంచంలో ఇలా పాపం పెరిగి నట్లు పెరిగి పోతూన్న ప్రజానీకం ఎక్కడ నుండి వస్తూన్నట్లు? అంటే, వీళ్లంతా పూర్వ జన్మలో ఎక్కడ ఉండే వారు? అధర్వణ వేదంలో అణుబాంబుల గురించి నిజంగా ఉందా? పురాణాలలో ఉన్న పాతని, పాశ్చాత్యులు ప్రవేశ పెట్టిన కొత్తని ఒక పంచకి తీసుకురావాలని ఒకే తాపత్రయం పడ్డాడు, పాపం – ఫలించ లేదు.

'ఇన్ఫర్మేషన్ థీరీ' లో 'ఎంట్రోపీ' అనే ఊహనాన్ని ఉపయోగించి ప్రపంచ భాషలన్నింటికి సంస్కృతమే మాతృభాష అని సిద్ధాంతీకరిస్తూ ఒక వ్యాసమూ, 'సెకండ్ లా ఆఫ్ థర్మోడైనమిక్సు'ని ఉపయోగించి పరకాయ ప్రవేశము సాధ్యమేనని రుజువు చేస్తూ ఒక వ్యాసమూ, చంద్రుడు గుడి కట్టడానికీ, కీచురాయి కూతకీ, సముద్రపు హోరుకీ, వర్షం పడడానికీ మధ్యనున్న కార్యకారణ సంబంధాలని సంఖ్యాశాస్త్ర పరంగా విశ్లేషిస్తూ ఒక వ్యాసమూ, ఇలా ఎన్నో పరిశోధనా పత్రాలు ప్రచురించేడు. దీనంతటినీ జనరంజక విజ్ఞానం అనేవాడు.

విజ్ఞుల మన్ననలు పొందాలంటే 'హార్డు సైన్సు'లో కూడ పరిశోధనలు చెయ్యాలి కదా? జీవి ఎలా పుట్టిందో, ప్రతివర్తిత ప్రభావంలో ఎలా పరిణతి చెందిందో, మొదలయిన విషయాలన్నీ జీవశాస్త్రానికి సంబంధించినవి అయినప్పటికీ ఆ విషయాలని భౌతిక శాస్త్రంలోని క్వాంటం గమన శాస్త్రం ఉపయోగించి విశ్లేషించవచ్చని మొట్టమొదట ప్రతిపాదన ఈయనే చేసేడు. అదే బాణీలో అభివృద్ధి చెందాలనే తహతహ ఉన్న బడుగు దేశాలని క్వాంటం కూపంలోని ఎలక్ట్రానులతో పోల్చి, ఆయా దేశాల ఆర్థిక, రాజకీయ స్థోమతలని పొటెన్షియల్‌తో పోల్చి, ఈ రెండింటిని ష్రోడింగర్ సమీకరణంలో ప్రతిక్షేపించి, బడుగు దేశాలు ప్రగతి పథంలో కుప్పి గంతులు వేసుకుంటూ ఎలా పైకి లేవ గలవో సిద్ధాంతీకరిస్తూ ఒక పత్రం ప్రచురించేడు. అది పెద్దల మన్ననలు పొందింది.

ఇలా రోజుకో కొత్త ఊహ, కొత్త స్ఫురితం. కొత్త పుంత తొక్కడం అంటే సామాన్యమైన వ్యవహారమా? 'కౌపీన సంరక్షణార్థం హయం పటాటోపః' అన్నట్లు పనులు చెయ్యడానికి విద్యార్థులు కావాలి. వాళ్లని పోషించడానికి 'ఫండింగు' కావాలి. ప్రయోగాలు చెయ్యడానికి సరంజామా కావాలి. ఈ సరంజామాని పెట్టడానికి స్థలం కావాలి. ఇలా ఒకడు బాగుపడిపోతూ ఉంటే చూడలేక అసహనంతో కళ్లు కుట్టుకు పోయిన వాళ్లు ఫేకల్టీ మీటింగులో అడ్డు పుల్లలు వేస్తూ ఉంటే వాళ్లని అదుపులో పెట్టడానికి కాలం ఖర్చు పెట్టాలి. అయినా సరే ఏకాగ్రతతో గమ్యం మీదే మనస్సుని నిలిపి తాబేలు–కుందేలు కథలోని

తాబేలులా, నెమ్మదిగా పరిశోధనా పత్రాలు ఒకటీ, ఒకటీ ప్రచురిస్తూ కొంచెం పేరు తెచ్చుకున్నాడు.

ఒకనాడు వైస్‌ఛాన్సలర్ గారి దగ్గరనుండి రావు గారికి పిలుపు వచ్చింది. ''మంత్రాలకి చింతకాయలు రాలతాయా?'' అనుకుంటూ, ఎదురొచ్చిన అపశకునాన్ని లెక్క చెయ్యకుండా 'వీసీ' గారి ఆఫీసుకి వెళ్లి, బయట పహరా కాస్తున్న డవాలా బంట్రోత్తుకి నమస్కారం చేసినంత పనిచేసి, 'స్వింగింగ్ డోర్' తెరుచుకుని లోపలికి వెళ్లేడు.

''మీ టేలెంటు నివురు కప్పిన నిప్పులా ఇలా ఈ ఆంధ్రా యూనివర్శిటీలో 'రాట'వడం ఏమీ బాగా లేదండీ.''

''కులపతిగారి మాటలలోని అంతరార్థం అర్థం కాలేదు, లక్ష్మణరావుకి. చూపుడు వేలితో పైపు లోని పుగాకుని నెమ్మదిగా నొక్కి, అగ్గిపుల్ల గీసి పుగాకుని ముట్టిస్తూ ప్రశ్నార్థకంగా వీసీ గారి వైపు చూసేడు లక్ష్మణరావు.

''ఎటామిక్ రిసెర్చి సెంటర్‌కి మీ బేగ్రౌండు ఉన్న మనిషి కావాలిట.'' అంటూ ఉద్యోగాలున్నాయని వచ్చిన విజ్ఞప్తి పత్రాన్ని లక్ష్మణరావుకి అందించేరు వైస్ ఛాన్సలర్.

పని, జీతం ఆకర్షణీయంగానే కనిపించేయి.

''ఈ ఉద్యోగం నాకు వస్తుందంటారా?''

''ఈ విషయాలన్నీ ఆలోచించకుండా మీకు కబురెందుకు పంపుతాను?'' అర్థగర్భితంగా చిన్న నవ్వు నవ్వి, మళ్లా అందుకున్నారు. ''ఇది మంచి ఆపర్ట్యూనిటీ. ఆలిండియా ఫేము వచ్చే ఛాన్సు. తెలుగు వాడు వరి మొక్క లాంటి వాడు. 'ట్రాన్స్‌ప్లేంట్' చేస్తే కాని రాణించడు. 'బార్క్' లో తెలుగు వాళ్లు చాల మంది పెద్ద, పెద్ద పొజిషన్స్‌లో ఉన్నారు. మీ కేండిడసీని గట్టిగా సిఫార్సు చేస్తూ సేత్నాకి నేను పెర్సనల్‌గా లెటర్ రాస్తాను. ఏమంటారు?''

భాభా, సరాభాయ్, సేత్నా, లక్ష్మణరావు! సిరిరా మోకాలొడ్డువారు ఎవరుంటారు? అదృష్టం పిలిచినప్పుడు పలకక పోతే మరి పిలవదుట. 'సరే' అన్నాడు.

బొంబాయికి బయలుదేరే ముందు సింహాచలం కొండ ఎక్కి స్వామికి దండం పెట్టుకున్నాడు. నున్నగా చెక్కించిన గుండుకి సీ. వీ. రామన్ తలపాగా చుట్టేడు. మామ్మ ఇచ్చిన మాగాయ జాడీ జాగ్రత్తగా మూటలో సర్దుకొని మెడ్రాసు మెయిల్ ఎక్కేడు. బండెక్కించడానికి వచ్చిన వీసీ గారు పక్కనున్న పి. ఏ. తో, ''అమ్మయ్య, వీడి పొజిషన్‌లో 'మన'వాడ్ని ఎవర్నయినా వేయంచవోయ్'' అన్న మాటలు రైలు కూతలో, రైలు మోతలో లక్ష్మణరావుకి వినిపించ లేదు.

బొంబాయిలో కాలు పెట్టింది మొదలుకొని లక్ష్మణరావు నసీబులో మార్పు కనిపించడం మొదలు పెట్టింది. ఆంధ్రా యూనివర్శిటీలో ఉన్న వసతులతో పోల్చి చూస్తే నక్కెక్కడ, నాగలోకం ఎక్కడ అనిపించింది. నువ్వు వైదీకివి అంటే నువ్వు నియోగివి అనీ, నువ్వు కమ్మ అంటే నువ్వు రెడ్డి అనీ అను నిత్యం ముసుగులో జరిగే గుద్దులాటలు ఇక్కడ

కనిపించ లేదు. ఏడాది తిరిగే లోగా ఫజికల్ రివ్యూలో రెండు పరిశోధనా పత్రాలు ప్రచురించేడు. తర్వాత పంపిన పరిశోధనా పత్రాలు, పై అధికారి బల్ల దగ్గర ఆగిపోయాయి. జీతం పెరిగింది. పదవి పెరిగింది. పరపతి పెరిగింది. పరిశోధనా పత్రాల పబ్లికేషన్‌కి పెర్మిషన్ మాత్రం రాలేదు.

... ... ...

ప్రధాన మంత్రి కార్యాలయం నుండి బయటకు వస్తూన్న లక్ష్మణరావు రెండంగుళాలు ఎక్కువ పొడుగయినట్లు ఫీలయాడు.

... ... ...

'గ్రవుండ్ జీరో' దగ్గర. 'కౌంట్ డౌన్' విజయవంతంగా పూర్తి అయితే పక్కనున్న ఎర్ర టెలిఫోను తీసి "బుద్ధుడు నవ్వేడు" అనాలి. ఏమయినా తేడా వస్తే 'బుద్ధం శరణం గచ్ఛామి' అనాలి. అన్నీ జాగ్రత్తగా మనస్సులోనే మననం చేసుకున్నాడు. మూడవ నెంబరు టెస్టు టన్నెల్‌లో తను రహస్యంగా దాచి పెట్టిన మామ్మిచ్చిన మాగాయ సీసా సంగతి మాత్రం ఎవ్వరికీ తెలియకూడదు.

పది, తొమ్మిది, ఎనిమిది, ఏడు, ఆరు, అయిదు, నాలుగు, మూడు, ...రెండు,... ఒకటి. కాలికింద భూమి కొద్దిగా కంపించింది. 'గ్రవుండ్ జీరో' దగ్గర చిన్న గాలి దుమారంలాంటిది రేగింది. ఆపెన్‌హైమర్‌లా లక్ష్మణరావు కూడ గీతలో శ్లోకం ఒకటి చదవడానికి ప్రయత్నించేడు. కాని ఇక్కడ 'దివి సూర్య సహస్రస్య' అన్న శ్లోకం నప్పదాయె. నప్పే శ్లోకం వేళకి ఏదీ తట్టదాయె. ఒణుకుతూన్న చేతులతో ఎర్ర టెలిఫోను తీసి ఢిల్లీకి వార్త అందించేడు లక్ష్మణరావు.

భూగర్భంలో పేలిన అణుబాంబు అన్ని విధాలా దిగ్విజయం అయిందనే ఒప్పుకోవాలి. ఈ సందర్భం పురస్కరించుకొని పాశ్చాత్య దేశాలలో ప్రావీణ్యం సంపాదించిన పెద్దలు సంప్రదాయానుసారం సలక్షణంగా షేంపెయిన్ సీసాలు ఊదేశారు. సనాతనుడయిన లక్ష్మణరావు మాత్రం లక్షణంగా మామ్మ చేసిన మాగాయ ముక్క నంచుకుని మజ్జిగా అన్నం తిన్నాడు. ఏమయినా ఆంధ్రుడికీ ఆవకాయ డొక్కకీ ఏదో అవినాభావ సంబంధం ఉంది.

ప్రోజెక్టులో పని చేసిన సిబ్బంది అందరికీ సెలవు ప్రకటించేరు. అందరూ ఎవరి ఇంటికి వారు బయలుదేరేరు. లక్ష్మణరావు రాయపూరు మీదుగా, వైజాగు వచ్చే బండి ఎక్కేడు.

సింహాచలం కొండ దిగువని రైలు బండి పరిగెడుతూ ఉంటే లక్ష్మణరావు గుండెలలో రైలు పరిగెడుతోంది. ఒంటికేదో వచ్చింది. చలిజ్వరం వచ్చిన వాడిలా ఒణుకు. గాభరా. స్వామికి కోపం వచ్చిందేమోనని బండి లోంచే దండం పెట్టుకున్నాడు. కడుపులో దేవినట్టయింది. ఒక్క పరుగున లేవెటరీకి వెళ్లేడు. ఒక విరేచనం, ఒక వాంతి అయేయి. గోపాలపట్నం దాటగానే ఔటరు దగ్గర బండి ఆగిపోయింది. ఒళ్లంతా నీరసం ఆవరించేసింది. గొంతుక పిడచ కట్టుకు పోతోంది. వెధవ రైలు కదలదేం? ఏ కలరా వచ్చిందో, మనిషిని ఎక్కడ

ముట్టుకుంటే ఏమిటి అంటుకుంటుందో అని ఎవ్వరూ దగ్గరకి వచ్చి సహాయం చెయ్యలేదు. నెమ్మదిగా బండి వాల్తేరు స్టేషన్ చేరుకుంది. లక్ష్మణరావు కొన ఊపిరితో బండి దిగి ప్లాట్‌ఫారం మీద మానులా కూల బడి పోయేడు. జీవితాంతం కలలు కన్న గమ్యం అందుబాటులోకి వచ్చే వేళకి నూనె నిండుకున్న దీపంలా లక్ష్మణరావు ఒక్క వెలుగు వెలిగి ఆరిపోయాడు. తెలుగు గడ్డ గాలి తగిలేసరికి ఏదో మహామారి నిండు వయస్సులో ఉన్న మనిషిని పొట్టన పెట్టుకుంది.

లక్ష్మణరావు మరణ వార్త విద్యుత్ ఘాతంలా తగిలింది నయాదిల్లీకి. మిలటరీ వారు నిమిషాలమీద శరీరాన్ని తమ అధీనంలోకి తీసుకొని, ప్రభుత్వంవారి పర్యవేక్షణలో, మిలటరీ వైద్యుల చేత శవ పరీక్ష చేయించేరు. రేడియేషన్ వల్ల సంభవించిన చావు కాదని నిర్ధారణ అయిన తర్వాతనే లక్ష్మణరావు మరణ వార్త దేశానికి తెలిసింది. మన ప్రయత్నం ఏమీ లేకుండానే అమెరికాలో కూడ ఈ వార్త పొక్కింది.

ఎంత బుర్ర బద్దలు కొట్టుకు చచ్చినా ఈ చావు ఎలా సంభవించిందో వైద్యులకి అర్ధం అయి చావ లేదు. కారణం ఇదమిద్ధంగా తేలే వరకు శవాన్ని దహనం చెయ్యడానికి ప్రభుత్వం ఒప్పుకో లేదు. పేథాలజీ వారు ప్రేతాన్ని ఏ కీలుకాకీలు విడగొట్టి కంచు కాగడాతో కారణం కోసం వెతుకుతున్నారు.

రెండు రోజులు తిరిగే సరికి లక్ష్మణరావు సహోద్యోగి ఒకడు మెద్రాసులో హరీ మన్నాడుట. చలి, ఒణుకు, వాంతులు, విరేచనాలు. శరీరం అంతా అతి త్వరగా ఎండిపోయిందిట. లక్షణాలు పొడ చూపిన కొద్ది నిమిషాలలో ప్రాణం పోయిందిట.

వ్యాధి లక్షణాలలో ఒక వరస, వావి కనిపించేసరికి ఇదేదో విష ప్రయోగమో, అంటురోగమో అయుండాలని అనుమానించేరు. విష ప్రయోగం అవునో కాదో తెలుసుకుందుకి పోలీసు దర్యాప్తు మొదలయింది. అంటురోగం అవునో కాదో తేల్చుకుందుకి బేక్టీరియా, వైరసుల మీద వైద్య బృందం వేట ప్రారంభించింది. ఇది ఒక వ్యాధే అని రుజువయే లోపునే తొంబ తొంబలుగా జనాలు చచ్చిపోతున్నారు.

ఈ తాజా వ్యాధికి ఎమ్. ఎల్. ఆర్. సింద్రోమ్ (అంటే, మందపాటి లక్ష్మణ రావుకి వచ్చిన జబ్బు లక్షణాలు కలది అని అర్ధం) అని డాక్టర్లు పేరు పెడితే, ఇది మలేరియా, కలరా వ్యాధులని పోలి ఉంది కనుక దీన్ని మలరా అంటే బాగుంటుందని ఒక పాత్రికేయుడు సూచించేడు. దివంగతుడైన ఆసామీ పేరు లోని పొడి అక్షరాలు పలికితే మలరా అవుతుందని మరొకడు సూచించేడు.

కార్చిచ్చులా మలరా భారత దేశం నుండి బంగ్లాదేష్‌కీ, పాకిస్తాన్‌కీ కూడ వ్యాపించింది. ఇరుగు పొరుగు దేశాలు ఆరాట పడడం మొదలు పెట్టేయి. కల్లు తాగిన కోతి నిప్పు తొక్కినప్పుడు గెంతినట్లు గెంతేడు పాకిస్తాన్ ప్రధాని భుట్టో. "ప్రతి 'ప్రాచ్యుడూ' అణుబాంబులు పేలుస్తానంటే ప్రపంచం ఇలానే తగలడి పోతుంది" అని గురివింద గింజ సామెత తెలియని నిక్సన్ రుసరుస లాడేడు. ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యాన దర్యాప్తు జరిపించి

ఈ మహామారికి కారణమైన దేశాన్ని శిక్షిస్తానని పత్రికా విలేఖరుల సమావేశంలో ఉద్ఘాటించేడు.

ఇలా అంతర్జాతీయ రంగంలో అల్లరి పెరిగే సరికి ఇంతకు ముందు ఎప్పుడూ కనీ, వినీ, ఎరగని మలరా ఎలా ఉద్భవించిందో తెలుసుకోవాలన్న పట్టుదల దేశంలో పెరిగింది. బాంబు పేలిన స్థలం అంతా శోదా చేసి చూసేరు. మూడవ నెంబరు టెస్టు టనెల్‌లో కీ. శే. మలరా గారు రహశ్యంగా దాచిన మాగాయ సీసా కనిపించింది. కాని ఆ సీసాలో సరుకు ఏమీ పాడవ లేదు. బొంబాయిలో లక్ష్మణ రావు పనిచేసే ఆఫీసు అంతటినీ కంచు కాగడా వేసి గాలించేరు. అక్కడ మరొక మాగాయ సీసా కనిపించింది. మొదటి దఫాలో మరణించిన వారంతా లక్ష్మణ రావు పనిచేసే ఆఫీసు ప్రాంతాలలో పనిచేసిన వాళ్లేనని తెలిసేసరికి పత్తేదారులంతా ఈ ఆఫీసు వాతావరణాన్ని పరి పరి కోణాలలో విశ్లేషించి చూస్తున్నారు.

ఆఖరికి తేలిన విషయం ఇది. బొంబాయిలో లక్ష్మణరావు పనిచేసే ఆఫీసులో ఒక టెలివిషన్ సెట్ ఉంది. ఆ సెట్ లోని టెలివిషన్ ట్యూబ్‌లో ఫ్లయిబేక్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న షీల్డింగు సరిగ్గా పనిచెయ్యడం లేదుట. ఆ కారణంగా ఆ ట్యూబ్‌లో జనించిన ఎక్స్ కిరణాలు 'లీకు' అవుతున్నాయిట. ఈ టెలివిషన్ సెట్ పక్కనున్న బీరువాలోనే మన లక్ష్మణరావు బామ్మగారు ఇచ్చిన మాగాయ సీసా ఉందిట. చెమ్మ తగిలిన మాగాయకి చిన్న బూజు పట్టిందిట. సాధారణంగా ఈ రకం బూజు అంత ప్రమాదకరమైనది కాదుట. కొంచెం ఎండలో పెడితే ఊరగాయ బాగుపడిపోతుందిట. కాని నిరపాయమైన ఈ బూజుకి ఒక నియమిత మైన శక్తి ఉన్న ఎక్స్ కిరణాలు తగిలే సరికి కొంప మునిగిందిట.

మన శరీరంలో లాగే బూజులోని జీవ కణాలలో వారసవాహికలు ఉంటాయి. ఈ వారస వాహికలలోని జీనుల పర్యవేక్షణలోనే ప్రాణ్యములు తయారవుతాయి. ఈ పద్ధతి ప్రకారం బూజు తయారు చేసే ఒక ప్రాణ్యపు బణువులో ఒక చోట సిస్టీను అనే పేరు గల నవామ్లం (ఎమీనో ఏసిడ్) ఉందిట. ప్రాణ్యపు బణువుని ఒక పూసల దండలా ఊహించుకుంటే, ఈ సిస్టీను ఒక జంట పూస లాంటిది. అంటే ఒకే పూస దండలో రెండు చోట్ల వస్తుంది. ఇది సాధ్యం అవాలంటే ఆ పూసల దండ మెలికలు తిరగాలి. మన టెలివిషన్ సెట్టు నుండి స్రవించిన ఎక్స్ కిరణాల ప్రభావం వల్ల వారసవాహికలు దెబ్బ తినడంతో ఈ జంట పూస లోని ద్విగంధక బంధం కూడా దెబ్బ తిని విడిపోయి, చుట్టూ ఉన్న చెమ్మ లోని ఉదజని అణువులతో కలసి రెండు థయోల్ గుంపులుగా మారిపోయిందిట. ఈ మార్పు వల్ల సిస్టిన్ కాస్తా సిస్టయిన్ గా మారడం వల్ల మన ప్రాణ్యపు బణువులో ఉండ వలసిన చోట మెలిక లేకుండా పోయిందిట. ఈ ఒక్క మార్పు వల్ల పుంఖాను పుంఖంగా అనేకమైన గొలుసు కట్టు మార్పులు వచ్చి బూజు మహామారి బేక్టీరియాగా మారిందిట.

ఎక్స్ కిరణాల శక్తిలో ఏ మాత్రం తేడా వచ్చినా ఈ ప్రతివర్తిత (మ్యూటేషన్) ఇలా జరిగి ఉండేది కాదుట. ఎందుకంటే సిస్టయిన్ లోని థయోల్ గుంపుకి వికిరణపు మోతాదు (రేడియేషన్ డోసు) ఏ మాత్రం ఎక్కువయినా నిశ్చలత్వం పోగొట్టుకుని నశించి పోతుందిట.

మూడవ నెంబరు టెస్ట్ టనెల్‌లో బాంబు వల్ల పుట్టిన ఎక్స్ కిరణాల మోతాదు చాల ఎక్కువ కనుక ఉత్త ప్రతివర్తితతో ఆగకుండా బేక్టీరియా సమూలంగా నాశనం అయిపోయింది. అందువల్లనే ఆ సీసాలోని మాగాయలో ఏమీ దోషం కనిపించ లేదు.

ఇలా ప్రతివర్తిత చెందిన ఈ బేక్టీరియా రోగి శరీరంలో చేరిన శీఘ్ర కాలంలో ప్రాణం తియ్య గలదుట. రోగి శరీరం నుండి ఉమ్మి, వాంతి, విరేచనాల ద్వారా ఈ బేక్టీరియా బయటకు వచ్చి, ఎండి 'స్పోరు'లుగా తయారయి, గాలిలో తేలి, సునాయాసంగా ఆమడల దూరం ప్రయాణం చేసి, చెమ్మ తగిలినప్పుడల్లా చేవ పుంజుకుని చంపుతున్నాయిట.

కనుక దక్షిణ ఆసియాలో ఇలాంటి మహామారి విజృంభించడానికి కారణం అణు బాంబు ప్రయోగంలో భారత దేశపు అప్రమత్తత కానే కాదు. చెత్తగా తయారు చెయ్యబడ్డ టెలివిషన్ సెట్! ఈ టెలివిషన్ సెట్ ఎవరు తయారు చేసేరా అన్న విచారణ అనవసరం. ఆ సెట్ మీదే పెద్ద పెద్ద అక్షరాలతో ఉంది. దీనిని అమెరికా ప్రభుత్వం తమ 'ఫారిన్ ఎయిడ్ ప్రోగ్రాం' లోని నిబంధనల ప్రకారం బలవంతంగా భారత దేశం చేత ఒక అమెరికన్ కంపెనీ దగ్గర కొనిపించిందిట. ఈ కమిటీ వారు తయారు చేసిన రిపోర్టుని భారత ప్రభుత్వం అమెరికా ప్రభుత్వానికి ఒక కాపీ, ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడికి ఒక కాపీ పంపింది. కారణాంతరాల వల్ల ఈ విషయం జనరల్ ఎసెంబ్లీలో చర్చకి రాలేదు.

చిరు నవ్వుతో చేతిలోని కపాలాన్ని దీక్షగా చూస్తూ, ''నిజమే! నాయనా! నేను చేసినది పొరపాటే. ''బృహత్ భోగే భవిష్యతి'' అని రాయ వలసింది.'' అన్నాడు బ్రహ్మ.

తండ్రి వాక్కులోని వ్యంగ్యాన్ని గమనించేడు నారదుడు. విధాత తన రాత లోని అంతరార్థాన్ని ఇలా వివరించేడు.

''సింహాచలంలో నరసింహస్వామి దేవాలయం నుండి పిఠాపురంలోని కుక్కుటేశ్వరుడి కోవెల ప్రాంగణంలో ఉన్న పాదగయ వరకూ ఉన్న భూభాగం గయుడు అనే రాక్షసుని శరీరంతో కల్మషం అయింది. ఆ భూమిలో పుట్టి, పెరిగి, జీవితాంతం కీర్తి కాంక్షతో అలమటించిన వ్యక్తి కపాలం ఇది. విధిని, విధాత రాతని ఎవ్వరూ అధిగమించ లేరు. దేశం అంతా సంచరించి, తిరిగి తిరిగి ఈ కల్మషమైన భూమిని తాకిన తర్వాతే రోగ లక్షణాలు బయట పడి మరణం సిద్ధించింది. మరణానంతరమే లక్ష్మణరావు పేరు, ప్రతిభ, జీవిత గాథ ప్రపంచానికి తెలిసింది. తన పేరు చిరస్థాయిగా నిలవాలని కలలు కన్న లక్ష్మణరావు పేరు లోని పొడి అక్షరాలు భూలోకంలో చిరకాలం నిలుస్తాయి. అందుకనే 'కించిత్ భోగే భవిష్యతి' అని రాసేను.

''మరయితే 'బృహత్ భోగే భవిష్యతి' అని రాయ వలసిందనడంలో...''

విచార వదనంతో ఉన్న కుమారుడిని ఊరడించడానికా అన్నట్లు, విరించి దరహాసంతో ఇలా అన్నాడు.

``తుచ్ఛమయిన ఈ కపాలం కాలచక్రంతో పాటు పంచభూతాలలోనూ కలసి పోవడానికి బదులు నీ వంటి దేవర్షి హస్తాలలో పడి స్వర్గానికి వచ్చిందంటే అది కించిత్ భోగం ఎలా అవుతుంది?

``నారాయణ! నారాయణ!!`` అంటూ నారద మహాముని తండ్రి దగ్గర సెలవు తీసుకున్నాడు.

(ఆంధ్రసచిత్ర వారపత్రిక సెప్టెంబరు 13, 1974 సంచికలో ప్రచురించబడ్డ కథ ఇది. అక్కడక్కడ చిన్న చిన్న తప్పులు సవరించడం జరిగింది తప్ప కథలో మార్పు ఏమీ లేదు.)